"ఆదేం?" ఆశ్చర్యపోయాడు. పార్వతీపతి.

"అది అంతే మీరన్నీ వప్పుకుంటే నాలుగేళ్ళ దాకా మాకు వర్కర్స్‌లో విలువేం వుంటుంది?"

అయిదు నిముషాల తర్వాత బయటికి వచ్చి చెప్పారు ఇద్దరూ బయట వేచి వున్న సోదర కార్మికులతో,

"కామ్రేడ్స్ మన యూనియన్ తరపున గట్టిగా పోట్లాడి మొత్తానికి నాలుగు డిమాండ్స్‌ని అంగీకరించేలా చేసాం. ఇది మనకి పెద విజయం. రేపటినించి పనిలో చేరుదాం. వర్కర్స్ యూనిట్ జిందాబాద్".

"వర్కర్స్ యూనియన్ జిందాబాద్ కామ్రేడ్స్ ఇంద్రసేనారావు జిందాబాద్, కామ్రేడ్ యాదగిరి జిందాబాద్" గొంతుచించుకుని అరిచారు. సోదర కార్మికులు సంతోషంగా.

# మందు

ఎర్రగడ్డలో ఒక సవారీ దించగానే, ఆటో డ్రయివరు వెంటనే మరో సవారీ దొరకడం తన అదృష్టంగా భావించాడు. ఆటో కోసం ఎదురు చూస్తున్న దాదాపు ఓ నలభై ఏళ్ళతను కంగారుగా ఆటో ఎక్కి "త్వరగా పోనీ" అన్నాడు.

"కహా జానా?" అడిగాడు ఆటో డ్రయివర్ హిందీలో — ఫ్లేగ్ దింపి.

"లక్‌డీ కా పూల్" చెప్పాడతను అదుర్దాగా ఆటో కొద్ది దూరం వెళ్ళగానే "ఓసారి ఆ మందుల షాపు దగ్గర ఆపు" అని కోరాడు ఆ ప్రయాణీకుడు వెనకసీట్‌లోంచి.

ఆటో ఆగగానే, ఆ మందులషాపులోకి నడిచివెళ్ళి ఆ షాపతన్ని ఏదో అడిగాడు ఆ మందులషాపతను తమ దగ్గర లేదన్నట్లుగా తల అడ్డంగా వూపాడు. మళ్ళీ వచ్చి ఆటోలో కూర్చొని ఆ ప్రయాణీకుడు "పోనీ" అన్నాడు.

ఆటో లక్‌డీ కా పూల్ చేరుకునే లోపల, అలా అయిదారు చోట్ల అతను ఆటోని ఆపించి మందులషాపుల్లోకి వెళ్ళి ఏదో అడుగుతూనే వున్నాడు. ఆ షాపులవాళ్ళు లేదని తల అడ్డంగా వూపడమో, చెప్పటమో జరిగాక, అతను వచ్చి ఆటోలో కూర్చుంటున్నాడు. అతనిలోని ఆదుర్దా అలా తిరిగివచ్చిన ప్రతిసారి అధికం కావడం గమనిస్తూనే వున్నాడు ఆటో డ్రయివర్.

ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఎవరికో సీరియస్‌గా వుండి వుంటుందని, మందుల కోసం ప్రయత్నిస్తున్నాడని వూహించాడు ఆటో డ్రయివర్. ఆటో లక్‌డీ కా పూల్ చేరుకోగానే ఓ పెద్ద మందులషాపు ముందు ఆపించి దిగి, దాంట్లోకి వెళ్ళాడు ఆ ప్రయాణీకుడు మళ్ళీ ఏదో అడిగాడు.

పది పదిహేను క్షణాల తర్వాత వెనక్కి వచ్చి ఆటోలో కూర్చున్నాడతను, చిన్నబోయిన వదనంతో.

నాలుగైదు నిముషాలదాకా మాట్లాడకుండా, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయాడతను.

"అభీ కహా జానా?" అడిగాడు డ్రయివర్.

"వెనక్కి" అన్నాడతను పెద్దగా నిట్టూర్చి.

ఆటోని మళ్ళీ ఎర్రగడ్డ వైపు తిప్పాడు డ్రయివర్ దారిలో ఇది వరకు అడగని ఒక మందులషాపు ముందు ఆపి, చెప్పాడు డ్రయివర్ ఆ ప్రయాణీకుడితో, అందులో దొరుకుతుందేమో ప్రయత్నించమని.

అతను ఆ మందుల షాపు లోనికి వెళ్ళి, వెంటనే తిరిగివచ్చేసాడు.

"ఛత్. ఎక్కడా దొరకమలా వుంది" అన్నాడు తనలో తను గొణు క్కుంటున్నట్లుగా.

ఆటో ఎర్రగడ్డ ఆస్పత్రి ముందు ఆగగానే, అతను కిందికి దిగి, గబగబా గేటు వైపు నడిచాడు.

సాబ్, ఆటో ఫేర్, ఏడురూపాయల చిల్లరయింది!" అరిచాడు డ్రయివర్ కూడా ఆటో దిగి, ఆగి జేబులు తడుముకుని అన్నాడా ప్రయాణీకుడు దీనంగా.

"లేదు. నిన్న రాత్రి మా నాన్నగారితో డాక్టరు అంటూంటే విన్నాను. మీ వాడు ఇరవై సంవత్సరాల నుంచి వుద్యోగం దొరకక పోవటంవల్ల పాడయ్యాడు ఉద్యోగమే సరయిన మందు అని. ఎక్కడైనా ఆ మందు దొరుకుతుందేమోనని ప్రయత్నం చేసాను నువ్వే చూశావుగా. దొరకలేదు ఆసంగతి డాక్టర్‌తో చెప్పాలి. ఆయనకేపిచ్చి నిజానికి. అయినా వప్పుకోడు చస్తే".

ఆస్పత్రి గేటువైపు దబదబా అడుగులు వేసాడతను.

ఆ ఆస్పత్రి పేరు "గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ డిసీజెస్"

తెలుగులో దానిని పిచ్చాసుపత్రి అంటారు.

## నన్ను శిక్షించండి

హైదాబాద్ సిటీ సివిల్‌కోర్టులుండే ఆవరణలో, చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ఆరోజు కేసులు ఎక్కువగా వున్నాయి.

ఉదయం పదకొండు పదికి ఆయన మొదటి కేసుని విచారించ సాగాడు.